భీమవరం సుందరీకరణ పనులపై సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి


సమీక్షకు హాజరైన అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): విధులపై నిర్లక్ష్య ధోరణి విడనాడి, ఆత్మ సాక్షిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. భీమవరంలోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం జిల్లా కలెక్టర్ ఆమె భీమవరం సుందరీకరణ పనులపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో పచ్చదనం ఏర్పాటుకు ప్రణాళికను సక్రమంగా అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జిల్లా ఏర్పడి సంవత్సరమైనా మున్సిపల్ సిబ్బంది పనితీరులో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుందని మండిపడ్డారు. మనసుపెట్టి పని చేస్తేనే లక్ష్యాలను సాధించగలమన్నారు. డివైడర్ల మధ్య ఉన్న మొక్కలను ట్రిమ్మింగ్ చేసి సోమవారం నాటికి అందంగా తీర్చిదిద్దాలన్నారు. పిచ్చి మొక్కలను తొలగించడం, నగరంలో గుర్తించిన పది ప్రాంతాల్లో మొక్కలు నాటించడం, అలాగే కాంపౌండ్ వాల్ వున్న ఖాళీ స్థలాలల్లో మొక్కలు నాటించడం వంటి పనులను స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ప్రైవేటు సంస్థల ముందు సంబంధిత యాజమాన్యంతో గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్ల నిర్మాణంపై శ్రద్ధ

రోడ్ల నిర్మాణాల విషయంలో పూర్తి నిర్లక్ష్యం కనపిస్తుందని, కచ్చితంగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని కోరారు. నగరంలో చేపట్టిన ఏడు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. జేపీ రోడ్డు నిర్మాణ పనులను ఎట్టి పరిస్థితుల్లో సోమవారం నాటికి ప్రారంభించాలని లేనిపక్షంలో రద్దు చేసి, ఆ పనులను వేరే కాంట్రాక్టర్‌కు కేటాయించాలన్నారు. ఉండి రోడ్డు, డిమార్ట్, ఫ్లైఓవర్ వద్ద, ఏరియా హాస్పిటల్ వద్ద అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఆదేశించినా ఎందుకు తాత్సారం చేస్తున్నారని సంబంధిత అధికారులను నిలదీశారు. మారుతినగర్ లో ఉన్న పార్కును స్పోర్ట్స్ పార్కుగా తీర్చిదిద్దేందుకు అంచనా వ్యయం ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలన్నారు. రోడ్డు మార్జిన్ లో ఉన్న షాపుల ముందు సంబంధిత యాజమాన్యంతో పేవర్ బ్లాక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోమని ఆదేశించినా ఇంతవరకు పనులను ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు? డీఎన్నార్ కాలేజీ ఎదురుగా, ఉండి రోడ్డు కెనాల్ వద్ద చెత్త వేయకుండా పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయమని సూచించినా ఇంతవరకు ఎందుకు ఏర్పాటు చేయలేదన్నారు. అమృత్-1 కింద ఏర్పాటు చేయాల్సి ఉన్న ఒక వెయ్యి గృహ అవసర కుళాయి కనెక్షన్లు వెంటనే ఇవ్వాలన్నారు. అమృత్-2 కింద వాటర్ పైప్ లైన్ల ఏర్పాట్లను, ఓహెచ్ఎస్ఆర్ లను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. అలాగే ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి పన్నుల బకాయిల వసూళ్ళు పెద్ద మొత్తంలో ఉండడంపై ప్రశ్నించారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీచేయాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో జాప్యం జరుగుతుందని ఆరోపణలు వచ్చాయని, లైసెన్సుల జారీలో తేడాలు వస్తే చర్యలు తీసుకోవాలన్నారు. టిడ్కో గృహాల కేటాయింపునకు చనిపోయిన 48 మంది లబ్ధిదారుల స్థానంలో వారి రక్తసంబంధీకులతో గృహాల కేటాయింపునకు చర్యలను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్ ఇ.త్రినాధరావు, ఏసిపి పి.గౌర్, ఆర్.ఓ వి.సోమశేఖర్, ఏవో కె.శ్రీనివాస్, డి.ఈ నారాయణరావు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి ఆర్. విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యం, అహింసా విధానాలు అలవర్చుకోవాలి


గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కాళ్ల: యువత సత్యం, అహింస విధానాలు అలవర్చుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎం ఆర్ రాజు విద్యార్థులకు సూచించారు. కాళ్ల మండలం పెదఅమీరం గ్రామంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్టులో గాంధీజీ స్ఫూర్తి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉత్తమ బాలలకు గాంధీ సర్టిఫికెట్లు, బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పరిశీలనాత్మక దృష్టిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, డాక్టర్ విజయకుమార్, మురళీ కృష్ణ, చంద్రశేఖర్ రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొల్లా సేవలు ఆదర్శనీయం


కొల్లా వెంకటరత్నం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కార్మిక సంఘాల ఐక్యతకు భీమవరంలో పునాది వేసిన కొల్లా వెంకటరత్నం నేటితరం కార్మికులకు ఆదర్శనీయుడని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ బజార్ జట్టు, రైస్‌మిల్, సివిల్ సప్లై వంటి వివిధ సంఘాల ఏర్పాటు కోసం, కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి వెంకటరత్నమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.వాసుదేవరావు, కలిపిండి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం

సాక్షి, భీమవరం: గునుపూడి గరువుపేటలోని రూ.10 వేలు విలువైన గడ్డి దగ్ధమైందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పూర్తిగా కాలిపోయిందన్నారు. అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో మంటలను అదుపు చేశామన్నారు.

సిద్ధాంతం సమస్యలపై ప్రత్యేక దృష్టి


సిద్ధాంతం గరగాలమ్మ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: దేవాదాయ శాఖ నిధులు, దాతల సహకారంతో సిద్ధాంతం కేదారీఘాట్ శ్మశాన వాటికను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు, సిద్ధాంతం సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో గ్రామ పెద్దలతో సమీక్ష నిర్వహించారు. తొలి విడతగా రూ. 65 లక్షల నిధులతో శ్మశాన వాటిక అభివృద్ధి ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు దాతల సహకారంతో అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. శ్మశాన వాటికలో 8 ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఘాట్‌లో ఆరు ప్లాట్ ఫాంలు, వరదల సమయంలో వినియోగించుకునేందుకు ఏటిగట్టుపై రెండు ప్లాట్ ఫామ్‌లు , టాయిలెట్స్, గదులు, విశ్రాంతి గదులు, పార్థివదేహాలకు స్నానం చేయించడానికి ప్రత్యేక గది చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళన

ప్రతి వర్షాకాలంలోనూ ఇబ్బందులు పాలు చేస్తున్న సిద్ధాంతం గరగాలమ్మడ్రెయిన్ ప్రక్షాళన చేపట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఆక్రమణల వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సత్వరం ఆక్రమణలు తొలగించి, డ్రెయిన్ ప్రక్షాళన చేపట్టాలన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

పెనుగొండ: ఎక్కడా, ఎటువంటి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలు ప్రోత్సహించకుండా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకునే విధంగా కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు రాణి అన్నారు. శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిరోధక చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి, గంటా సరస్వతి పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

పాలకొల్లు అర్బన్: నిరుపేదల ఇంటి నిర్మాణాలు చకచకా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. శనివారం ఆమె కొంతేరు జగనన్న లేఅవుట్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌లలో మౌలిక వసతులు త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. ఇంటి నిర్మాణాల్లో ప్రతీ రోజు పురోగతి కనిపించాలన్నారు. పునాదుల నుంచి స్లాబు వరకు ప్రతీ రోజు ప్రగతి కనిపించే విధంగా లబ్ధిదారులను తొందరపెట్టాలన్నారు. జగనన్న లేఅవుట్‌లలో అవసరమైన చోట బ్రిక్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.పిచ్చయ్య, హౌసింగ్ డీఈ రామాయణం త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

చైతన్యంతోనే మహిళలకు రక్షణ


మహిళా దినోత్సవం సందర్భంగా సైకిల్‌ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది ఎన్.సత్య విజ్ఞాన దేవి.

ఆకివీడు: మహిళల చైతన్యంతోనే వారి రక్షణ ముడిపడి ఉందని ప్రిన్సిపాల్ కే.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత, మహిళా దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీయ రక్షణతో మహిళలు ముందుకు వెళ్లాలన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్న నేటి సమాజంలో మహిళలపై దాడులు జరగడం సిగ్గుచేటని విమర్శించారు. బాలికల దగ్గర నుంచి మహిళలంతా అన్ని విషయాల్లో అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాల గురించి తెలుసుకోవాలని, రక్షణచర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సాధికారిత సభ్యురాలు సింహాద్రి జ్యోతి, ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ విజయ్ అనిల్ దాయ్, ఎన్ఎస్.ఎస్.కోఆర్డినేటర్ కొల్లి ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

సత్ప్రవర్తన సమాజానికి శ్రేయస్కరమని మహిళా సీనియర్ న్యాయవాది ఎన్.సత్య విజ్ఞాన దేవి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో భీమవరం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలపై జరుగుతున్న అకృత్యాల్ని అరికట్టేందుకు తల్లులు వారికి మంచి నడవడిక నేర్పాలన్నారు. సంస్కారవంతమైన జీవనం వైపు నడిచే విధంగా మార్పులు తీసుకురావాలన్నారు. చెడు ప్రభావం, మంచి ప్రభావాల్ని వివరించి చెప్పాలన్నారు. బాల్య వివాహ నిషేధచట్టం, గృహ హింస, మనోవర్తి చట్టం తదితర చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కె.జ్యోతి, సూపర్‌వైజర్ రత్నకుమారి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుంటాం


నియోజకవర్గ సమావేశానికి వెళుతున్న ఉండి మండల నాయకులు

ఉండి: వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకుంటామని ఉండి మండల ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ అన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రతినిధులకు శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి స్థానిక సంస్థల ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎమ్మెల్సీలు ఏకగ్రీవం కావాల్సి ఉండగా గెలవలేమని తెలిసి కూడా ఏదో రకంగా ఇబ్బందికి గురిచేయాలని టీడీపీ, జనసేన పార్టీలు తమ అభ్యర్థులను బలపరచిన వారిని బరిలో నిలిపి ఎన్నికలు జరిగేలా చేస్తున్నారని మండిపడ్డారు. 85 శాతం ఓట్లు వైఎస్సార్ సీపీకే ఉన్నాయని అటువంటి సమయంలో ఎలా గెలుస్తామని ప్రతిపక్షాలు బరిలో నిలబడ్డారని అన్నారు. కార్యక్రమంలో పీవీఆర్‌కే ఆంజనేయరాజు, గుత్తుల కనకమహాలక్ష్మీ ,దత్తాల సుజాతరాణి, నిమ్మల కేశవ కుమార్, చిగురుపాటి కృష్టాఫర్, పేరిచెర్ల అరుణ భార్గవి, మున్నలూరి సువర్ణలక్ష్మీ, గిరడ రమణ,అల్లూరి మాధవి, రాయి రావులమ్మ,వీరమల్లు సత్యవతి, ఈది ఎడ్వర్డ్ పాల్గొన్నారు.

నేడు నిరంతర వైద్యవిద్యా బోధన సదస్సు


భీమవరంలో సదస్సు వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ రమణారావు

సాక్షి, భీమవరం: ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పాల్కన్‌నెస్ట్‌లో నిరంతర వైద్య విద్యా బోధన సదస్సు నిర్వహిస్తున్నట్లు మానసిక వైద్యుడు జీవీ రమణారావు తెలిపారు. శనివారం విలేకర్ల సమావేశంలో సదస్సు వివరాలను వెల్లడించారు. ఆత్మహత్యల నివారణ, చిన్న పిల్లలలో ఉండే కుదురులేని స్థితి, వ్యాధి నివారణ, చికిత్సలు, పొగాకు అలవాటు మాన్పించడానికి వచ్చిన కొత్త వైద్య విధానాలు, మానసిక రుగ్మతలకు వాడే మెగ్నెట్ థెరపీ, మానసిక వైద్యంలో కొత్త పోకడలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సులో జాతీయ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు, దక్షిణ భారతీదేశపు సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఉదయ్ కుమార్, భీమవరం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, డాక్టర్ మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొంటారని రమణారావు చెప్పారు.

నియోజకవర్గ పెద్దను కోల్పోయాం


పాతపాటి సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: నియోజకవర్గ పెద్దాయన, రాజకీయ గురువు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ స్వర్గీయ పాతపాటి సర్రాజును కోల్పోవడం తీరని బాధాకరమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు కన్నీటి పర్యంతమయ్యారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన ఆయన శనివారం సర్రాజు నివాసం వద్దకు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అందరినీ కలుపుకుని, మరీ చనువుతో వీపు మీద తట్టి మరీ పలకరించే స్వభావం కలిగిన వ్యక్తి సర్రాజు అని కొనియాడారు. నన్ను రాజకీయాల్లోకి తీసుకువచ్చి, వెన్నంటి నడిపించి, ఎన్నో సూచనలు, సలహాలు ఇచ్చిన గురువుగా కొలిచానన్నారు. పేదల అభివృద్ధి, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేసేవారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, సాగిరాజు హరివర్మ, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, వీఆర్కే ఆంజనేయ రాజు, కనుమూరి రంగరాజు, అంబటి రమేష్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి వైద్యం అందించాలి


పెన్నాడలో పర్యటిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ మహేశ్వరరావు

పాలకోడేరు: ప్రతి ఒక్కరికి వైద్యం అందే విధంగా చూడడంతో పాటు, చిన్నపిల్లలకు రోగ నిరోధక టీకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జిల్లా వైద్యాధికారి (డీఎంఅండ్‌హెచ్ఓ) మహేశ్వరరావు అన్నారు. పెన్నాడ గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంతో పాటు అదే గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డీఎంఅండ్‌హెచ్ఓ శనివారం పరిశీలించారు. ఎఫ్‌పీసీ కార్యక్రమాన్ని సమయపాలన పాటిస్తూ గ్రామంలో ఉన్న రోగికి వైద్యం చేరేలా చూడాలన్నారు. బెడ్ పేషెంట్‌ను, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందిన రోగులను, పాఠశాల విద్యార్థులను దగ్గరికి వెళ్లి పరీక్షించాలన్నారు. అదేవిధంగా యూఐపీ క్యాంపును ఎండలు విజృంభిస్తున్నందున ఉదయమే చిన్నపిల్లలకు వ్యాక్సిన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వెంట సీసీ హరి, పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రంగం నాయుడు, డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ, సూపర్వైజర్లు అయ్యప్ప శ్రీనివాస్, శంకర్, చండి రాణి తదితరుల ఉన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని ధర్నా


భీమవరంలో గ్యాస్‌ధర పెంపునకు నిరసనగా ధర్నా చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలు పెంపు ప్రజలపై మోయలేని భారమని తక్షణమే పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి డిమాండ్ చేశారు. వంటగ్యాస్ ధర పెంపును నిరసిస్తూ శనివారం గునుపూడిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పకుమారి మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే వంటగ్యాస్ ధరలు తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ అధికారంలోకి వచ్చేక విపరీతంగా ధరలు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, ఇప్పుడు ప్రజలపై గ్యాస్ ధరల పెంపు గోరుచుట్టుపై రోకలి పోటులా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు సావారపు దేవి, పిండి సత్యవతి, పసుపులేటి దానమ్మ, వలవల అరుణ కుమారి, దశక రామలక్ష్మి, మేకా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుని ఆలయం వద్ద అన్నసమారాధన


సోమేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం


ఆకివీడులో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక గంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శనివారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పిండివంటలతో తొలుత స్వామివారికి నైవేద్యం సమర్పించి, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం చైర్మన్ గనిశెట్టి షణ్ముఖేశ్వరరావు, ఆలయ ఈవో కూచంపూడి శ్రీనివాసరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకివీడులో..

ఆకివీడు: వేద పండితుల పారాయణతో నిత్యం వెలుగొందే అతి పురాతన దేవాలయం స్థానిక భీమేశ్వరస్వామి ఆలయమని తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్ చెప్పారు. మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవం ముగింపు సందర్భంగా శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు ఎంతో నమ్మిక కలిగిన దేవాలయం అని చెప్పారు. అఖండ అన్నసమారాధనలో పెద్దింటి అమ్మవారి దేవస్థానం చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి, డైరెక్టర్ కుంకట్ల దానయ్య, మాజీ ఎంపీటీసీ మోరా జ్యోతి, కల్యాణోత్సవ కమిటీ చైర్మన్ గుఱ్ఱం శ్రీహరి, ఆలయ మాజీ చైర్మన్ సన్నిధి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లేగదూడల పరిరక్షణతోనే పశువుల వృద్ధి


లేగదూడ యజమానికి బహుమతి అందజేస్తున్న డీడీ జవహార్ హుస్సేన్

ఆకివీడు: ఆరోగ్యంతో ఉన్న లేగ దూడలతోనే పశువుల వృద్ధి పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు జవహార్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో శనివారం పశు సంవర్ధక శాఖ, గణన శాఖల ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన, అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హుస్సేన్ మాట్లాడుతూ లేగదూడల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పుట్టిన దూడకు అర గంటలోపు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. రోగనిరోధక శక్తిని పెంచే గుణం ఈ పాలల్లో ఉందన్నారు. పుట్టిన బిడ్డను తల్లి పశువు నాకుతుందని, అలా చేయకపోతే గోని సంచెతో తుడిచి శుభ్రం చేయాలని చెప్పారు. ముక్కు రంధ్రాల నుంచి నోటిలో నుండి జిగురు పొరలను తుడిచి శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. లివర్ టానిక్, ఫీడ్ సప్లిమెంట్ అందజేశారు. లేగదూడ ప్రదర్శనలో ప్రథమ స్థానం కోట రామకృష్ణ, ద్వితీయ స్థానంను మద్దాల వెంకటేష్, మూడవ స్థానంను కోలా శ్రీనివాస్ రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట అనంతలక్ష్మీ, ఈఓ డీఎల్పీఏ డాక్టర్ జేసురత్నం, సహాయ సంచాలకులు కే.జనార్ధన రావు, మండల పశువైద్యురాలు కెల్లా భార్గవీ సత్య పాల్గొన్నారు.

వైభవంగా కేశవ స్వామి రథోత్సవం

తణుకు టౌన్: మండలంలోని మండపాక గ్రామంలో ఉన్న శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ కేశవ స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సబ్బరపు సుజితాదేవి, సబ్బరపు రామారావు, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్ పాల్గొన్నారు.

రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


వీఆర్వోలతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో దాసి రాజు

కాళ్ల: రీ సర్వే పనులు త్వరితగతిని పూర్తి చేయాలని భీమవరం ఆర్డీవో దాసి రాజు అధికారులకు సూచించారు. కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే పనులను సమీక్షించి పారదర్శకంగా తప్పులు లేకుండా చేయాలని అధికారులకు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో కాళ్ల తహసీల్దార్ టీపీ కృష్ణారావు, ఆర్ఐ రాఘవరాజు, సర్వేయర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ హబ్ ఇంటీటివ్ పథకం ద్వారా 2 లేదా మూడు నెలల స్వల్ప కాలవ్యధి కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ పీ శ్రీనివాసరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి పాస్ అయ్యి 15 నుండి 45 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. ఫీల్డ్ టెక్నిషియన్ ఎయిర్ కండీషనర్, ఎలక్ట్రీషియన్ డెమెస్టిక్ సొల్యూషన్ ఈ రెండు కోర్సులకు పదో తరగతి,అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ కోర్సుకు మాత్రం 5వ తరగతి పాసైన వారు అర్హులన్నారు.ఈ కోర్సుల్లో చేరేందుకు ఎలాంటి ఫీజు కట్టనవసరం లేదని పూర్తిగా ఉచితమన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20 లోపుగా నేరుగా ఐటీఐకి వచ్చి గాని 96760 99988 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

కోడి పందేల శిబిరంపై దాడి

పాలకోడేరు: మండలంలోని గొల్లకోడేరు శివారులో కోడిపందేల శిబిరంపై దాడి చేసి 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.4,500, ఒక కోడిని, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వర్మ తన సిబ్బందితో శనివారం దాడులు చేసి గూడాల బాబులును అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఇన్‌స్పెక్టర్ వర్మ తెలిపారు. ఈ దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేంద్రప్రసాద్, సిబ్బంది శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, గణేష్ పాల్గొన్నారు.